సెప్టెంబర్ - అక్టోబర్, 2012

# స్పర్శ

ఆధ్యాత్మిక ద్విమాస పత్రిక



“ మనుష్యులలో తప్పలు
చూస్తూ ఉంటే
ప్రేమ చూపుటకు
అవకాశమే ఉండదు”



# “మనస్సులోని మాట”

**క్రీస్తుయేసునందు ప్రియులైన వారికి శుభమని చెప్పి వ్రాయునది.**

మీరంతా దేవుని దయ వలన క్షేమమని తలంచుచున్నాను. మహా దేవుడు మిమ్ములను, మీ కుటుంబములను కృప, క్షేమములతో నడిపించును గాక !

దేశ, రాష్ట్ర పరిస్థితులను చూస్తే ఎటు చూచిన సమస్యలు, ఇబ్బందులు. ఒక ప్రక్క స్కాంలు, కుంభకోణాలతో పార్లమెంటు జరగని స్థితి ఉంటే మరొక ప్రక్క రాష్ట్రంలో పవర్ లేక ఇండస్ట్రీస్ సరిగా నడవని పరిస్థితులు వీటి ఫలితం ఉత్పాదకత తగ్గి దేశ ఆర్థిక వ్యవస్థ ఛిన్నాభిన్నం అవుతుంది. వీటి అన్నింటికి మూలాలను పరిశీలిస్తే మనుష్యులలో ఉన్న స్వార్థము, దేశములో లేక రాష్ట్రములో ఉన్న సహజ వనరులు, యువకులైన ప్రజలు వీరి ద్వారా ఎంతో ప్రగతి సాధించడానికి అవకాశములు ఉన్నప్పటికీ, సరియైన దిశానిర్దేశము చేసేవారు లేకపోవడం, నాయకులైన వారు ప్రతి పనిలో స్వలాభం గూర్చి ఆలోచించడం తప్ప తమ చుట్టూ ఉన్న వారి అవసరతలు పట్టించుకోక పోవడం అనేక సర్వేల ప్రకారం మన దేశములో ఉన్న సంపద దేశ రూపురేఖలను మార్చివేస్తుంది. కాని ఆ సంపద అంతా కొద్దిమంది చేతిలోనే ఉండిపోయింది. సక్రమముగా కంటే అక్రమంగా కోటానుకోట్ల రూపాయలు సంపాదించి దానిని నల్లధనంగా (బ్లాక్ మనీ) మార్చి దేశ అభివృద్ధికి అవి ఎంత మాత్రం అందుబాటులో లేకుండా చేసారు. సమాజ పరిస్థితులు ఇలా ఉంటే ప్రజలు నిరాశ, నిస్పృహలతో వ్యవస్థలను దూషించడం అలవాటైపోయింది.

క్రీస్తు రక్తం చేత కడగబడి రక్షించబడిన క్రైస్తవులుగా మనము ఒకటి చేయగలము. అదే ప్రార్థన. ప్రార్థన ద్వారా అసాధ్యమైనవి సాధ్యం అవుతాయి అని దేవుడు అనేకసార్లు తన భక్తుల ద్వారా తెలియపరిచాడు. ఏలియా మన వంటి స్వభావము గల మనుష్యుడే గాని ప్రార్థించిన వెంటనే సృష్టి అతని ప్రార్థనకు లోబడింది. అలాగే మన ప్రార్థనలు తప్పక సమాజములో ఎలాంటి మార్పునైనా తేగలవని మనము విశ్వసించవలెను. సమస్యలను చూచి భయపడేవారు దేవుని కుమారులు, కుమార్తెలు కాదు. ఎంత పెద్ద సమస్య అయినప్పటికి దాని కంటే గొప్ప దేవుడు మనకి ఉన్నాడు అనే ధైర్యముతో ముందుకి సాగిపోవలయును. ఆయన పరిష్కరించలేని సమస్య ఈ సృష్టిలో ఏదీ లేనే లేదు.

కనుక ఇట్టి ఆసక్తితో ప్రార్థించే వారిగా దేవుడు మనలను తీర్చిదిద్దును గాక ! ఆమెన్



మీ సహోదరుడు.....

సెప్టెంబర్ - అక్టోబర్, 2012

# స్పర్శ

ఆధ్యాత్మిక ద్విమాస పత్రిక

## ఈ సంచికలో...


- శిష్యుల శిక్షణ ........ 2
- హెమెట్, కాలిఫోర్నియా ........ 5
- బలము - బలహీనత (స్త్రీల ప్రత్యేకం) ........ 7
- సాధు సుందర్ సింగ్ జీవిత చరిత్ర - 24వ భాగము ........ 9
- సహకారము (బాలల శీర్షిక) ........ 11
- నా జీవితంలో చేసిన మేలులు (సాక్ష్యము) ........ 13
- మదర్ తెరీసా ........ 15
- ప్రార్థన ఊపిరిపీల్చుట వంటిది ........ 19
- నదులు ........ 21
- బైబిల్ క్విజ్-24 ........ 22
- జన్మదిన శుభాకాంక్షలు ........ 23



మా చిరునామా: ఎపఫ్రా మినిస్ట్రీస్, ప్లాట్ నెం.6, భాగ్యలత కాలని, వనస్థలిపురం,
హైదరాబాద్-500 070, ఫోన్: 040-2420 2227

# శిష్యుల శిక్షణ

- బ్రదర్. ఎపఫ్రా

ప్రతి పనికి శిక్షణ ఎంతో అవసరం. శిక్షణ లేకుండా ఏదైనా పనిని చేయటం ప్రారంభిస్తే దాని వలన నష్టం, ఎన్నో అనర్థాలు కలుగుతాయి. అందుకే అన్ని రంగాల్లోనూ శిక్షణా కేంద్రాలను ఏర్పాటు చేసుకొని వారి వారి అవసరతల నిమిత్తము ట్రైనింగ్స్ ఇవ్వటం జరుగుతంది. మన దేశంలో కాని, ఇతర దేశాలలో కాని ప్రభుత్వాలు మిలటరీ కొరకు ఇచ్చే ట్రైనింగ్ ఎంతో ప్రాముఖ్యమైనదిగా భావిస్తారు. కఠోరమైన శిక్షణతో యుద్ధము కొరకు సైనికులను సిద్ధపరుస్తారని మనందరికి తెలిసిన సత్యం.

అయితే దానికంటే కూడా ఎంతో ప్రాముఖ్యమైనది దేవుని రాజ్యమును కట్టుట అనే కార్యక్రమం. దేవుని మాట వినక దూరమై సాతాను వాని దూతలకు సిద్ధపరచిన నిత్య అగ్నిగుండంలోకి త్రోసివేయబడుచున్న మానవాళిని, సువార్తను ప్రకటించుట చేత యుగయుగములు జీవించటానికి దేవుడు సిద్ధపరచిన పరలోక రాజ్యములోనికి నడిపించుటయే దేవుని రాజ్యమును కట్టుట. దేవుడు తన శిష్యులకు ఎన్నో విధములుగా శిక్షణనిచ్చి దేవుని రాజ్యమును కట్టుట కొరకు సిద్ధపరచటం బైబిల్ గ్రంథంలో మనం చూడగలం. వాటిలో ప్రాముఖ్యమైన కొన్ని విషయములను మనము ధ్యానించుకుందాం.

**1. అభ్యంతరములు కలిగించకుండా జీవించుట**

అభ్యంతరములు వచ్చుట సాధారణమైన విషయమేనని, అభ్యంతరములు రాకుండా ఉండుట అసాధ్యము కాని, అవి రావటానికి ఎవరు కారణమైతే వారికి శ్రమ అని ప్రభువు చెప్పటం జరిగింది. ఆయన శిష్యులుగా జీవించాలని ఆశిస్తున్న ప్రతి ఒక్కరు దేని విషయములోను అభ్యంతరంగా ఉండకుండా చూచుకొనవలెను. ఈ చిన్న వానిలో ఒకనికి అభ్యంతరము కలుగజేయుటకంటే మెడకు తిరుగటి రాయి కట్టబడి, సముద్రంలో పడవేయబడుట మేలు అని వ్రాయబడి ఉంది. చాలా మంది తల్లిదండ్రులు తమ పిల్లల మనసులు పాడు చేసేవారిగా ఉంటారు. అనవసరమైన విషయాలు వారితో మాట్లాడుతూ, అర్థం పర్థం లేని కండీషన్స్ వారికి పెడుతూ వారు భరించలేని బరువులు వారిపై మోపుతూ వారిని అభ్యంతరపరిచేవారిగా ఉంటారు. **తండ్రులారా, మీ పిల్లలకు కోపము రేపక ప్రభువు యొక్క శిక్షలోను బోధలోను వారిని పెంచుడి ఎఫెసీ 6:4** కనుక పెద్దలు ఎల్లప్పుడూ పిల్లల విషయమై శ్రద్ధ కలిగి ఉండాలని దేవుడు ఎంతగానో కోరుకుంటున్నాడు. వారికి ఆటంకం కలిగే విధంగా జీవించకూడదు.

పౌలు రోమా సంఘానికి ఉత్తరం వ్రాస్తూ ఇలా హెచ్చరించటం జరిగింది. కాగా మనమికమీదట ఒకనికొకడు తీర్పు తీర్చకుందుము. **ఇదియుగాక, సహోదరునికి అడ్డమైనను ఆటంకమైనను కలుగజేయకుందుమని మీరు నిశ్చయించుకొనుడి - రోమా 14:13** మన తోటి

వారికి ఆటంకం కలిగించే విధంగా జీవించ వద్దు అని హెచ్చరించటం కనపడుతుంది. ఒక మనుష్యుడు తన వ్యక్తిగతంగా దేవునికి విరోధంగా జీవించటం పాపం అయితే అతనిని బట్టి వేరొకరు అభ్యంతరపడే విధంగా ప్రవర్తించడం మరింత పాపము. కనుక మనము అభ్యంతరపరిచే విధంగా ఉండకూడదు.

**2. అందరితో సరియైన సహవాసం కలిగి ఉండుటకు క్షమించుడి**

నీ తోటి సహోదరుడు నీ యెడల తప్పిదము చేసిన యెడల అతనిని గద్దించుము. అతడు మారుమనస్సు పొందిన యెడల అతనిని క్షమించుము. కొందరు తమ తోటి వారి యెడల చాలా కఠినమైన వైఖరి కలిగి యుంటారు. ఎంత మాత్రము క్షమించటానికి ఇష్టపడరు. అది సరియైన విధానం కాదు. మనలను ఎంతగా గాయపరిచినప్పటికీ మనము క్షమించుట అనేది నేర్చుకొనినట్లయితే అది మనకు ఎంతో మేలు. నీ యెడల ఏడు సార్లు తప్పిదము చేసినను దేవుడు క్షమించుము అంటున్నాడు. ఏడు సార్లు మాత్రమే క్షమించమని కాదు కాని, యూదులకు ఏడు సంపూర్ణ సంఖ్య గనుక లెక్కలేనన్ని సార్లు క్షమించమని దేవుని యొక్క ఉద్దేశ్యం. మనం పేతురు విషయంలో ప్రభువు చెప్పిన మాటను బట్టి దీనిని స్పష్టంగా అర్థం చేసుకోవచ్చు. ప్రభువా ఎన్ని సార్లు క్షమించాలి? ఏడు సార్లా, అని పేతురు అడిగినప్పుడు ప్రభువు 490 సార్లు అని Unlimited అనే దానికి సాదృశ్యంగా చెప్పడం జరిగింది.(మత్తయి 18:21,22) మనుష్యులు క్షమించుటలో వెనకబడిపోవుటకు కారణం, క్షమించుట అంటే చేతకానితనం అని లేక క్షమిస్తే నష్టపోతాం అని ఎంతో మంది క్షమించటానికి ఇష్టపడరు. కానీ దేవుని ఉద్దేశ్యంలో క్షమించుట అనగా మనకి మనమే మేలు చేసుకొనుట. ఎవరు ఎదుటివారిని క్షమిస్తారో వారిని దేవుడు క్షమిస్తారు. ఎవడైనను తన పొరుగువానిని క్షమించకపోయిన యెడల దేవుడు వానిని కూడా క్షమించడు అని మత్తయి 6:14 లో వ్రాయబడి ఉంది.

త్వరగా క్షమించుటకు ఎల్లప్పుడూ శ్రద్ధ కలిగి ఉందుము. క్షమించుటలో ఎవరు ముందు ఉంటారో వారు అందరితో మంచి సంబంధం కలిగి ఉంటారు. అట్టి వారు దేవుని పని చేయుటకు ఎన్నో అవకాశాలు కలిగి ఉంటారు.

**3. విశ్వాసంలో ఎదుగుట**

దేవుని శిష్యులైనవారు విశ్వాసంలో ఎదుగుటకు ఎల్లప్పుడూ ఆసక్తి కలిగి ఉండవలెను. మొదటిగా విశ్వాసం అంటే ఏమిటి? హెబ్రీ 11:1 ప్రకారం విశ్వాసం అనేది నిరీక్షింపబడిన వాటి యొక్క నిజ స్వరూపం. కనిపించనివి ఉన్నాయి అనుటకు ఋజువు. నేను చూచిన తరువాత నమ్ముతాను అనేది ఎప్పటికీ విశ్వాసం కాదు. చూడని వాటిని ఒప్పుకొనుటయే విశ్వాసం. అయితే విశ్వాసం ఎలా కలుగుతుంది? దానికి జవాబు రోమా

10:17లో విశ్వాసం వినుట వలన కలుగుతుంది, వినుట దేవుని మాటను బట్టి కలుగుతుంది. విశ్వాసం కలిగి ఉండుటకు మరియు విశ్వాసంలో బలపడుటకు ఒకే ఒక మార్గము దేవుని మాట వినుట, చదువుట మాత్రమే. మనము విశ్వాసము కలిగి యున్నాము అని ఎలా తెలుసుకోగలము? (యాకోబు 2:17) విశ్వాసము క్రియలతో కూడినది కాని యెడల అది ఎందుకూ పనికిరాదు. విశ్వాసము క్రియలతో కూడినది అయితే అది కార్యసిద్ధి కలిగి సంపూర్ణ విశ్వాసం అవుతుంది. "ప్రాణము లేని శరీరము ఏలాగు మృతమో, ఆలాగే క్రియలు లేని విశ్వాసమును మృతము." విశ్వాసం లేకుండా దేవునికి ఇష్టులైయుండుట అసాధ్యమని బైబిల్ చెప్పుచున్నది.

**4. చేయవలసినది మాత్రమే చేయుచున్నామని ఎరుగుట**

నిజమైన శిష్యుడు ఎల్లప్పుడూ తను దేవుని కొరకు చేసిన ఏ కార్యమును బట్టి అతిశయపడలేదు. ఎందుకంటే కేవలం బాధ్యత మాత్రమే నెరవేరుస్తున్నాము కానీ అంతకంటే ఎక్కువ ఏదీ చేయట్లేదు. ఆయన తన స్వరక్తమిచ్చి మనలను కొనిన సంగతి మనమెరుగుదుము. మన మీద ఆయన పూర్తి అధికారము కలిగి యున్నాడు. శిష్యుడు ఎల్లప్పుడూ గురువుని అనుసరించి జీవించుట అతని బాధ్యత. ఈ దినములలో దేవుని కొరకు చేస్తున్న కార్యములను హెచ్చింపుతోను, అతిశయముతోను చేయుట ఎంతో దుఃఖకరము. దేవుని పనిలో పాటలు పాడువారు, వాయిద్యములు వాయించువారు, అధికారము చేయువారు, వాక్యమును బోధించువారు, కానుకలు ఇచ్చువారు, దేవుని కొరకు ఏదో త్యాగము చేస్తున్నట్లుగా భావించుట సరియైనది కాదు అని గ్రహించవలెను. ప్రతివారు వారి వారి బాధ్యతలు మాత్రమే నెరవేరుస్తున్నారు అనే సంగతే వాస్తవం. దేవుని సంఘంలో పని చేస్తున్నప్పటికి అది మన ధన్యత అని భయముతో, వణుకుతో దానిని కొనసాగించవలెను. కీర్తనాకారుడైన దావీదు **నా దేవా, నీ చిత్తము నెరవేర్చుట నాకు సంతోషము నీ ధర్మశాస్త్రము నా అంతర్యములోనున్నది - కీర్తన 40:8** అని చెప్పుచున్నాడు.

కనుక తన శిష్యులకు యేసయ్య ఇచ్చుచున్న ప్రాథమిక శిక్షణను మనము కూడా గ్రహించి ఎవరి ఆత్మీయ జీవితానికి అడ్డుబండగా ఉండక త్వరగా క్షమించే మనసు కలిగి విశ్వాసంలో వృద్ధి చెందుతూ నా బాధ్యతను మాత్రమే నెరవేరుస్తున్నానని గుర్తించి ముందుకు కొనసాగవలెను. ప్రతి విశ్వాసి తన ఆత్మీయ ప్రయాణంలో ఈ నాలుగు విషయాలను జ్ఞాపకం ఉంచుకొనవలెను. కారణం ప్రభువు పరలోకానికి ఆరోహణమై వెళ్ళేటప్పుడు సమస్త జనులను నా శిష్యులనుగా చేయమని చెప్పటం ద్వారా శిష్యరికపు శిక్షణలో మనం కూడా భాగమే అనే సంగతి గుర్తుంచుకొనవలెను.

ఇట్టి ధన్యతను దేవుడు దయచేయును గాక !

# హెమెట్, కాలిఫోర్నియా



ఈ పట్టణం మంత్ర తంత్రాలు, మూఢ నమ్మకాలు, సంఘ విజ్ఞానం, మాదక ద్రవ్యాలు వంటి ప్రభావములతో ఉంది గనుక అది భయంకరమైన ప్రమాదములో ఉంది. ఈ పట్టణం పాస్టర్ల స్మశానంగా పేర్కొనబడింది. ఈ ప్రాంతం దురాత్మల అభ్యాసంతో నిండిపోయింది. ఇది కుమారులు, మనువలు గ్యాంగులుగా ఏర్పడి కొట్లాడుకునే ప్రాంతం. ఒకవేళ పోలీసులకు తగిన ఆధారం లేకపోతే వారు ఆ ప్రాంతముల నుండి తరలిపోతారు. అసెంబ్లీ ఆఫ్ గాడ్ సంఘ కట్టడమును ఈ గ్యాంగులు మధ్య రాత్రి వచ్చి నాశనం చేశారు. హెమెట్ లోయ కూడా మాదకద్రవ్యములకు పెద్ద కేంద్రం. కనీసం 9 మాదక ద్రవ్యాల ప్రయోగశాలలు ఆ ప్రాంతంలో పని చేస్తున్నాయి. పొడి వాతావరణం, ఏకాంత ప్రాంతం, స్నేహపూర్వకంగా చట్టాల అమలు వారికి ఎంతో ప్రయోజనకరంగా ఉన్నాయి. తరువాత రోజులలో మాదకద్రవ్యాల్లో పాల్గొన్న ఒక డీలరు రక్షించబడిన తరువాత డీలర్లకు మాదక ద్రవ్యాలను తమ స్వంత కార్లలో పోలీసులు తీసుకు వెళ్ళి ఇచ్చేవారని అతడు సాక్ష్యమిచ్చాడు. ఒక నెలలో మిలియను ప్రజలకు మాదక ద్రవ్యాలను సరఫరా చేయడానికి అతడు ఒకేసారి వాటిని సిద్ధపరిచాడు.

ఈ సమాజం పట్ల భారంతో నిండిన బెకెన్ గారు దగ్గర్లో ఉన్న పర్వత ప్రాంతములో సంపూర్ణ రాత్రి ప్రార్థన, ఉపవాసమును ఏర్పాటు చేశాడు. ఆ ప్రాంతమును బాగా ప్రభావితం చేసే ఆత్మీయ మండలం లోనిది ఏదో తాకాలని వారు ప్రార్థనలో నమ్మారు. సమాజములో ప్రాకిపోతున్న సమస్యను గురించిన తాజా సమాచారమును పరిశోధకులు విజ్ఞాపనకర్తలకు అందించారు. అక్కడ ప్రబలి ఉన్న సమస్యను దృష్టిలో ఉంచుకొని వారు ప్రార్థించడం మొదలుపెట్టారు.

ఫలితంగా విజ్ఞాపన అద్భుతమైన ఫలితాలను ఇచ్చింది. ఒకప్పుడు భయంకరంగా వ్యాపించిన దురాత్మల ఆరాధన సభ్యత్వం తగ్గిపోయింది. ప్రత్యేక ప్రార్థనల వలన దురాత్మ కార్యములు జరిగే కేంద్రాలు మంటలో కాలిపోయాయి. ఆ మంట ఇరుప్రక్కల ఉన్న బిల్డింగులను తాకలేదు. గ్యాంగులకు సంబంధించిన సమస్యలు కూడ తగ్గుముఖం

పట్టాయని పోలీసులే సాక్ష్యమిచ్చారు. ఒకసారి ఒక ప్రముఖ గ్యాంగు సభ్యుడు ఉదయకాల ఆరాధనలో పాల్గొని తాను రక్షింపబడాలని పాష్టరుగారితో చెప్పాడు. 'తరువాత పేరుగాంచిన ఫస్ట్ స్ట్రీట్ గ్యాంగు' కూడా రక్షించబడింది. వారు అంటి పెట్టుకునే నిర్మాణాలు గల సంఘకట్టడాలను కూడా తొలగించారు. '70 శాతం మాదకద్రవ్యాల వ్యాపారం తగ్గిపోవడానికి కారణం విజ్ఞాపన' అని ఒక వ్యక్తి చెప్పాడు. ఒక తుపాకితో ఒకరిని హత్య చేయాలని వెళ్తున్న వ్యక్తి కూడా రక్షించబడ్డాడు.

10 సంవత్సరముల క్రితం ఉన్న సంఘం కంటే ఇప్పుడు సంఘం రెండింతలు పెరిగింది. మేయరు, పోలీసు ప్రధానాధికారి, సిటి మేనేజరు వంటి అధికారులలో కూడా దేవుడు మార్పును తెచ్చాడు. చట్టమును అమలు చేసే సిబ్బంది, టీచర్లలో 30 శాతం మంది విశ్వాసులు అని ఒక స్థానిక కథనం పేర్కొంది. దేవుడు స్కూలు వ్యవస్థలను కూడా దర్శించాడు. పెద్ద మార్పు చోటు చేసుకొంది. ఈ ప్రాంతములలోని సంఘములు కొట్లాడుకోవడం లేదు గాని ఐక్యతతో కలిసి పని చేస్తున్నాయి. నాయకులు తమ వ్యత్యాసములను పరిష్కరించుకొని తమ ప్రసంగ వేదికలను పవిత్రపరిచారు. సంస్థలు అన్నీ కలిసి ఉచితంగా ఆహారం, బట్టలు, వైద్యపరీక్షలు చేసి క్రీస్తుని గురించి ప్రకటించే ఒక సమావేశమును ఏర్పాటు చేశాయి. సంఘం అనేది నాలుగు గోడల మధ్య కూర్చునేది కాదని, అది బయటికి వెళ్ళి జీవితములను తాకేది అని వారు నమ్మారు. ఈ కార్యక్రమమునకు ఆకర్షితులై 300 మంది తమ హృదయములను క్రీస్తుకు సమర్పించారు. హెమెట్ ప్రాంతం ఇంకా పరివర్తన ప్రక్రియలో ఉంది.

అనుదినం వార్తా పత్రికలలో చదివే భయంకర నివేదికల వలన నీ హృదయం చలించడం లేదా? పతనమైన మన సమాజమును ఏదీ కూడా మార్చలేదని మీరు నిరీక్షణను వదిలేశారా? మార్పు జరుగుతుంది. ఉజ్జీవం వస్తుంది. జీవితములు మారగలవు. ఎలా? దేవుని ప్రజలు తీవ్రమైన విజ్ఞాపనకు తమను తాము సమర్పించుకొన్నప్పుడు, రాత్రింబగళ్ళు ఉజ్జీవం కోసం మొరపెట్టే ప్రజల ద్వారా దేవుడు ఏమి చేయగలడో చరిత్ర సాక్ష్యమిస్తుంది. నీ సమాజంలో, సంఘాల్లో ఉజ్జీవం కోసం నీవు మోకాళ్ళ మీద మొరపెట్టడం దేవుడు చూచి, గొప్ప కార్యములు చేయగలరు.

# బలము - బలహీనత

- సిస్టర్ వి. విజయ

స్త్రీ జీవితము ఎంత బలమైనదో, అంతే బలహీనమైనది కూడా. ఏదైనా సాధించగలరు, సాధించలేరు. అదే విధంగా ఎవరైనా కాస్త ప్రేమగా మాట్లాడితే ఎంతో పులకరించిపోతారు, నా అంతటి వారు లేరు అనుకుంటారు. తనను ప్రేమించేవారు ఎవరూ లేరు అని తెలిస్తే, కృంగిపోయి ఏమీ చేయలేని స్థితిలోకి వెళ్ళిపోతారు. మనలను ప్రేమించేవారు ఉన్నారని అతిశయపడి, వారి వైపు చూచుకుంటూ దేవునిని మర్చిపోవడం, మరొక ప్రక్క ప్రేమించే వారు లేరని బలహీనురాలైపోయి, నేను ఒంటరిని అని కృంగిపోతూ దేవుని జ్ఞాపకం చేసుకోకపోవడం. ఈ రెండు స్థితులు ప్రమాదకరమైనవే. మనుష్యులను చూచి ధైర్యం తెచ్చుకోవడం స్త్రీ బలమైతే, మనుష్యులను బట్టి కృంగిపోవడం స్త్రీ బలహీనత. ఈ రెండు పరిస్థితులు గుండా వెళ్ళే ఏ స్త్రీ తన గమ్యమును చేరుకోలేదు. మనం ఏ స్థితిలో ఉన్నా మనలను ప్రేమిస్తూ, చేతులు చాచి మన కొరకు ఎదురు చూస్తున్న ప్రేమామయుడైన దేవుని మీద ఆధారపడడం ఎంతో అవసరం.

మనందరము గుర్తు చేసుకోవలసిన వాస్తవమైన విషయం ఒకటి ఉంది. తల్లి గర్భములో పిండముగానే మనలను రూపించిన చేతులు, చూచిన కన్నులు, ముదిమి వచ్చు వరకు మనలను చంకనెత్తుకునే దేవుడు మనలను ప్రేమించి మన కొరకు ప్రాణం పెట్టిన తండ్రి మనకి ఉన్నారు, మనలను ప్రేమిస్తున్నారు.

శారీరకంగా, మానసికంగా, ఆత్మీయంగా కృంగిపోయి, సొమ్మసిల్లి, ముందుకు వెళ్లలేక పరిస్థితులను తలచుకొని మాటి మాటికి దుఃఖపడుతుంటే లేఖనములలోని మాటని ఒక్కసారి జ్ఞాపకం చేసుకుందాము.

**సొమ్మసిల్లిన వారికి బలమిచ్చువాడు ఆయనే శక్తిహీనులకు బలాభివృద్ధి కలుగజేయువాడు ఆయనే - యెషయా 40:29**

మనము ఊహించినట్లుగా ఎప్పుడూ ఒకే విధంగా మన జీవితము ఉండదు. మనము అనుకున్నది అనుకున్నట్లుగా జరిగిపోదు. జరిగిపోయిన, జరుగుచున్న పరిస్థితులను బట్టి మన ఆలోచనా విధానం కొనసాగుతూ ఉంటుంది. వీటిని బట్టి సొమ్మసిల్లుతాము, శక్తిని కోల్పోతాము. అలా కాక మన పరిస్థితులు ఏ విధంగా ఉన్నను, లేకపోయిననూ మనము చేయవలసింది ఒకటి ఉంది. మనలను ప్రేమించు తండ్రి, మనము సంతోషంగా ఉండాలని ఆశించే దేవుని వైపు మన కన్నులెత్తి చూడాలి. ప్రతి చిన్న సమస్యకు అనవసరంగా ఖంగారు పడక మనము విశ్వసించిన దేవుని వైపు కన్నులెత్తి చూడాలి. బైబిల్ గ్రంథములో యూదులు అనబడే ఇశ్రాయేలు ప్రజల కొరకు ఒక శాసనం

చేయబడింది. **అదారు అను పండ్రెండవ నెల పదమూడవ దినమందు యౌవనులనేమి వృద్ధుల నేమి శిశువుల నేమి స్త్రీల నేమి యూదుల నందరిని ఒక్క దినమందే బొత్తిగా నిర్మూలము చేసి వారి సొమ్ము కొల్లపుచ్చుకొమ్మని తాకీదులు అంచె వారి చేత రాజ్య సంస్థానము లన్నిటికిని పంపబడెను. ఎస్తేరు 4:13** ఆ రాజ్యములోని రాణి యూదురాలు. ఈ మాట వినగానే యూదులైన ఆ ప్రజలు రాణియైన ఎస్తేరును బట్టి ధైర్యము తెచ్చుకోలేదు గాని, ఏ సంస్థానమునకు రాజుగారి ఆజ్ఞయు, శాసనములు వచ్చాయో అక్కడ ఉన్న యూదులు ఉపవాసముండి మహా దుఃఖములోను, ఏడ్పులోను, రోదనములోను మునిగినవారైరి. రాణియైన ఎస్తేరు పినతండ్రియైన మొర్దకై కూడా గోనెపట్ట ధరించుకొని, మహా శోకముతో రోదనము చేసెను. ఈ విషయమును తెలుసుకున్న రాణి ఎస్తేరు కూడా రాజైన అహష్వేరోషు వైపు సహాయం కోసం చూడలేదు కానీ పరిస్థితులను మార్చగలిగిన దేవుని వైపు తన కనులను ఎత్తి ఆయన సన్నిధిలో ఉపవసించి ప్రార్థించడానికి సిద్ధపడింది. పరిస్థితులను బట్టి తమ చుట్టూ ఉన్న మనుష్యులను చూచి ఎంతో ధైర్యము తెచ్చుకోవచ్చు గానీ వారందరూ సమస్తమును చేయగల దేవుని వైపు మాత్రమే చూచారు. కనుక రాజ శాసనములను మార్పు చెందే విధంగా దేవుడు సహాయం చేసి, వారికి సంతోషమును కలుగజేసారు.

విశ్వాసమునకు కర్తయు, దానిని కొనసాగించు వాడునైన యేసువైపు చూచుచూ ఈ పరుగుపందెములో ఓపికతో పరిగెత్తుదము అని హెబ్రీ పత్రికలో పౌలు చెప్పిన మాటలు, వాటి ప్రకారం జీవించిన భక్తుల జీవితములు మనకి ధైర్యమును కలిగిస్తున్నాయి. అపో.పౌలు శారీరకంగా, ఆత్మీయంగా, క్రీస్తు నిమిత్తము పడిన శ్రమలు, నిందలు అవమానములలో సొమ్మసిల్లక, ఆయనలో శక్తి పొందుకొని గొప్ప పరిచర్యను జరిగించాడు.

మన అనుదిన జీవితములో ఎటు చూచినా పోరాటమే. ఈ పోరాటముల మధ్యలో ప్రతి అవసరత కొరకు యేసు వైపు చూచుచూ, ఓపికతో సాగిపోవడం ద్వారా తప్పక దేవుని సహాయమును పొందుకొనెదము.

అట్టి కృపను దేవుడు మనకు దయచేయును గాక !


రండి! పాల్గొనండి!! ఆశీర్వాదం పొందండి !!!

**2012 అక్టోబర్ 2వ తేది ఉపవాస ప్రార్థన**

దేశ క్షేమం, క్రైస్తవ సంఘాల ఉజ్జీవం,
కుటుంబముల ఆశీర్వాదము కొరకు దేవుణ్ణి వేడుకుందాం.

**సమయం:** ఉదయం గం. 9.00 లకు
వివరములకు: బ్రదర్. రవీందర్, సెల్: 99631 17628

# సాధు సుందర్ సింగ్ జీవిత చరిత్ర



**- సీరియల్ 24వ భాగము**

దూతలు ఉన్నారని సుందర్ ప్రగాఢంగా విశ్వసించాడు. పాశ్చాత్యులైన ఆయన స్నేహితులు ఎంత సందేహించినను, ఎంత జాగ్రత్తగా ఉండినను దూతలు ఉన్నారనే దాని విషయములో తాను అపాయకర స్థితిలో ఉన్నప్పుడు వారే వచ్చి తనకు సహాయం చేశారని నిస్సందేహంగా నమ్మాడు సుందర్. హిమాలయ పర్వత ప్రాంతముల నుండి తిరిగి వచ్చిన తరువాత తనకు సహాయం, విడుదల దొరికిన సందర్భములను ఎంతో సహజ ధోరణిలో ఆయన వివరిస్తూ ఉండేవాడు. దేవదూతలే మానవ రూపములో వచ్చి తనకు సహాయం చేశారని చెప్పేవాడు.

ఒకసారి ఓ అడవి దారినే వెళ్ళుచుండగా చివరికి అది ఎంతో ఉధృతంగా ప్రవహిస్తున్న పెద్ద నది దగ్గరకు చేరినది. దానిని దాటడం అసంభవమనిపించింది సుందర్‌కు. రాత్రి కావడంతో జంతువుల అరుపులు చెవులలో గింగురుమనడంతో ఈ రాత్రి యేమైపోతుందో ఇక నా పని అయిపోయినట్లేనని సుందర్ తలంచాడు. నిర్మానుష్యంగా ఉన్న ఆ స్థలంలో ఒంటరిగా చావుని ఎదుర్కోవడానికి మరెవరికైనా ఎలా ఉండేదో గాని సుందర్‌కైతే ఎంతో కష్టమనిపించింది. కన్నీళ్ళతో నిండిపోయాడు. ఆ స్థితిలో నది ఆవలకు చూచినపుడు ఒకతను చలి కాచుకోవడం కన్పించింది. ఆవలి వ్యక్తి కేక వేసి యేమీ భయపడవద్దు. వచ్చి నా భుజముల మీద కూర్చో అని సుందర్‌తో చెప్పాడు. అతని భుజములపై కూర్చుని నది దాటుతూ ఇతడు ఈ ప్రాంతపు వాడై యుంటాడు. అందుచేతనే ఈ నదిని ఇంత సులభంగా దాటగలుగుచున్నాడు. ఇతనికి యేసుప్రభువును గూర్చి చెప్పాలి అని తన మనస్సులో తలంచుకొన్నాడు. ఆవలి ఒడ్డుకు చేరిన తరువాత సుందర్ క్రిందికి దిగి తనను మోసికొని నది దాటించిన వాని ధైర్యసాహసాలకు ఆశ్చర్యపడుచూ అతనికి వందనాలు చెప్పడానికి వెనుదిరిగి చూచినంతలో అతడు అతర్ధానమై పోయాడు. అంతే కాదు, చలి కాచుకోవడం కోసం అక్కడ వేసిన చలిమంట జాడ కూడ కనబడలేదు.

మరోసారి ఎన్నడు లేనంతగా అలసిపోయి కాళ్ళు నొప్పి పెట్టడంతో ఎంతో కృంగిపోయిన మనస్సుతో అతికష్టం మీద నడుస్తున్నాడు. ఇంతలో మరో బాటసారి సుందర్‌తో కలిసి ఎంతో స్నేహపూర్వకంగా మాట్లాడ నారంభించాడు. అతని సంభాషణ

సుందర్‌ని ఎంతగానో సేదదీర్చి పైకి లేపింది. తాను చేరవలసిన గ్రామం వచ్చేసరికి సుందర్‌కి అలసట తీరినట్లై మనస్సు ఉల్లాసంగా ఉంది. ఆ సమయములో అప్పుడే తనకు పరిచయమైన ఆ క్రొత్త స్నేహితుని వైపు తిరిగేసరికి తాను తప్ప మరెవ్వరు సుందర్‌కి కనబడలేదు. ఆయనతో వచ్చిన ఆ బాటసారి అంతర్ధానమైపోయాడు. ఆ బాటసారి తన బలహీన దశలో తనను బలపర్చి పైకి లేవనెత్తడానికి వచ్చిన ప్రభువు దూత తప్ప వేరే ఇంకెవ్వరూ కాదని సుందర్ గ్రహించాడు.

మరొకసారి కన్యాన్ అనే స్థలంలో వాక్యం ప్రకటించడానికి దినమంతా ప్రయాణిస్తూనే ఉన్నాడు. అచట చేరి సువార్త ప్రకటిస్తున్నప్పుడు తీవ్రంగా ఎదిరించిన కొందరు ప్రతిసారి ఆయనకు అడ్డు తగులుచూ సువార్తను ప్రకటించనీయలేదు. ఆకలితోను ఎంతో వేదనతోను అడవిలోకి వెళ్ళి ఓ చెట్టు క్రింద పండుకొని అలానే నిద్రపోయాడు. అర్థరాత్రివేళ ఎవరో తట్టగా లేచాడు. 'లేచి భోజనం చేయి' అని ఒక స్వరం తనతో చెప్పడం విని లేచి చూస్తే తినడానికి భోజనం, త్రాగడానికి నీళ్ళు అందిస్తూ ఇద్దరు వ్యక్తులు తన ప్రక్కనే నిలిచియుండడం చూచాడు. తనపై జాలిపడిన గ్రామస్తులే తనకీ ఆహారమును తెచ్చారేమోనని తలంచుచూ ఎంతో కృతజ్ఞతతో తృప్తిగా భుజించి తరువాత వారితో మాట్లాడుదామని తలెత్తి చూస్తే అప్పటికే వారు అంతర్ధానమైపోయారు.

దూతలు తనకు సహాయం చేశారని సుందర్ చెప్పిన వాటిలో ప్రముఖంగా చెప్పుకోదగిన సంఘటన రాసా పట్టణంలో జరిగింది. విదేశీమతమును ప్రచారం చేయడానికి తమ దేశం వచ్చాడన్న ఆరోపణతో అతనిని అక్కడ ఖైదు చేశారు. ఆ తరువాత వారి నాయకుడైన లామా దగ్గరకు తీసికొని పోగా సుందర్‌కి అతడు శిక్ష విధించాడు. అది మరణ దండనతో సమానం. టిబెట్‌లోని మతాచార ప్రకారం ఎవ్వరినీ చంపకూడదు గనుక నేరస్తుని నేరుగా చంపకుండ అతడు చనిపోయే రీతిగా చేసే రెండు పద్ధతులు వారు కనిపెట్టారు.

(ఇంకా వుంది)

సేకరించబడినది



# సహకారము

పిల్లలూ ఎలా ఉన్నారు? బాగున్నారా? Quarterly Exams కి బాగా Prepare అవుతున్నారా? బాగా చదువు కుంటున్నారా? మంచి మార్క్స్ తెచ్చుకోవాలి. ప్రార్ధన చేసుకుంటున్నారా? ఎప్పుడూ మనకోసమే మనం ఎక్కువసార్లు ప్రార్ధిస్తుంటాము. కానీ ఇతరుల కొరకు ప్రార్ధించడంలో గల ఆంతర్యాన్ని, అర్ధాన్ని దేవుడు చూసి మనకు ప్రతిఫలమిస్తాడు. యోబును చూడండి, అతను తన స్నేహితుల కొరకు ప్రార్ధిస్తే దేవుడు వెంటనే అతని క్షేమ స్థితిని మరల అతనికి దయచేసెను. ఇతరుల కోసం దేవుని వేడుకోవడంలో ఉన్న విశిష్ఠతను మీకు తెలియ చేయాలని ఈ కథ చెబుతున్నాను.

ఒక రాజుగారు తన ఆస్థానంలోని పెద్దలందరికీ ఒక పెద్ద రాచరికపు విందు ఏర్పాటు చేశారు. రాజుగారిచ్చే విందు ఎలా ఉంటుందో మనం ఊహించుకోవచ్చు. ఎంతో రుచికరమైన, ఇష్టమైన పంచభక్ష్య పరమాన్నాలను బల్లలపై ఏర్పాటు చేశారు. అయితే ఈ విందు భోజనంలో పాల్గొనేవారికి రాజుగారు ఒక షరతు విధించారు. అదేమిటంటే విందులో పాల్గొనే ప్రతి ఒక్కరికి వారి ఒకచేతిని వారి భుజం వెనకాల కట్టేస్తారు. కాగా, ఖాళీగా ఉన్న మరో చేతికి ఒక పొడవాటి, స్పూన్‌ను కట్టారు. ఆ పొడవాటి స్పూన్‌తో చకాచకా వారికిష్టమైన పదార్ధాలు తృప్తిగా ఎంతసేపయినా కడుపారా తినవచ్చు.

ఓస్! ఇంతేనా ... ఇదెంత పనిలే అనుకున్న వారంతా తప్పులో కాలేశారు. ఒక చేయి వెనుకకు కట్టేయగా మిగిలిన ఒక చేతితో అది కూడా కట్టేసిన స్పూన్‌తో తినడం వారందరికీ చాలా ఇబ్బందిగా ఉంది. స్పూన్‌లో తీసుకున్న ఆహార పదార్ధాలు నోటిదాకా రావడం లేదు. మధ్యలోనే నేలమీద రాలిపోతున్నాయి. ఎదురుగా నోరూరించే పదార్ధాలు.... కడుపులో ఆకలి ... తిందామంటే నోటికి రావడం లేదు. ఎదురుగా ఇష్టమైన పదార్ధాలు పెట్టి రాజుగారు భలే తిరకాసు పెట్టాడులే! అనుకుంటూ వారంతా రాజుగారిని తమలోతాము తిట్టుకోసాగారు. అందరికీ నక్కా – కొంగబావల కథ జ్ఞాపకమొచ్చింది.

అయితే ఇందుకు భిన్నంగా ఇలాంటి ఏర్పాట్లతోనే మరొక గదిలో విందు జరుగుతోంది. కాని, అక్కడ పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉంది. ఆ విందులో పాల్గొన్న

వారెంతో తృప్తిగా తింటున్నారు. తమ తెలివితేటలకు తామే మురిసిపోతూ శభాష్ అని తమనుతామే అభినందించుకుంటున్నారు. అదెలాగంటారా? అక్కడ విందుకు హాజరైన వాళ్ళు తెలివిగా పొడవాటి స్పూన్ కట్టిన చేతితో తీసుకున్న ఆహారాన్ని తాము తినకుండా తమ ఎదురుగా ఉన్నవాళ్ళ నోటికి అందించుకుంటున్నారు. అనగా ఒకరికి ఒకరు తినిపించుకుంటూ అందరూ తృప్తిగా కడుపు నిండుగా విందు భోజనం ముగించారు.

చూశారా పిల్లలూ! మొదటి గదిలోనివారు తృప్తిగా విందు భోజనం చేయలేకపోయారు. వాళ్ళ గురించి మాత్రమే కాక ఎదుటి వ్యక్తిని గురించి ఆలోచించినట్లయితే వాళ్ళు కడుపు నిండుగా విందు భోజనం తిని ఉండేవారు. దేవుని ప్రార్థించడమంటే సరిగ్గా ఇలాంటిదే ! ఇతరుల మేలు ఆశించి చేసే ప్రార్థనను దేవుడు తప్పక ఆలకిస్తాడు. ఇది ప్రార్థనా విశిష్ఠతను తెలియచేస్తుంది. గొప్ప ఫలితాన్ని కూడా ఇస్తుందని ఈ కథ ద్వారా అర్థం చేసుకోవచ్చు.

పిల్లలూ టీచర్స్‌డే బాగా ఎంజాయ్ చేశారా? మనందరి జీవితములలో టీచర్స్ ప్రముఖ పాత్రను పోషిస్తారు. మనం ఇంటి తరువాత ఎక్కువ సమయం గడిపేది స్కూల్‌లోనే. టీచర్స్ యొక్క ప్రభావం మన జీవితం మీద చాలా ఉంటుంది.

అసలు ఈ టీచర్స్‌డే ఎలా పుట్టిందంటే, సెప్టెంబర్ 5న భారత ద్వితీయ రాష్ట్రపతిగా పదవీ బాధ్యతలు నిర్వహించిన డా॥సర్వేపల్లి రాధాకృష్ణన్ జన్మదినం. 1962 నుండి 1967 వరకు దేశాధ్యక్షుడిగా పని చేసిన రాధాకృష్ణన్ ప్రారంభంలో ఓ ఉపాధ్యాయుడిగా విద్యారంగంలో ఎనలేని సేవలందించారు. రాష్ట్రపతిగా ఉన్న కాలంలో ఆయన పుట్టిన రోజున అభినందించేందుకు వచ్చిన వారిని ఉద్దేశించి, “నన్ను అభినందించడం కంటే ఉపాధ్యాయులను అభినందించడం నాకు ఎక్కువ ఆనందాన్ని ఇస్తుంది” అన్నారు. అప్పటి నుండి ప్రతి ఏటా ఆయన పుట్టిన రోజున ఉపాధ్యాయ దినోత్సవాన్ని జరుపుకుంటున్నాం.

పిల్లలూ ఇక ఉంటాను సెలవా మరి!

– మీ అక్కయ్య

# "నా జీవితములో దేవుని మేలులు"

శేఖర్, కృష్ణాజిల్లా

నా పేరు శేఖర్‌బాబు, నేను ఒక నామకార్థ క్రైస్తవ కుటుంబములో పుట్టాను. మాది ఇందుపల్లి గ్రామము, కృష్ణాజిల్లా. నేను, మా అమ్మ, నాన్న, చెల్లి ఉండేవారము. మా తల్లి, తండ్రి రోజూ కూలిపని చేసుకుంటూ మమ్మల్ని చదివించారు. నేను ఐ.టి.ఐ చేశాను.

మాది క్రైస్తవ కుటుంబముగా కనిపించినప్పటికి, యేసుక్రీస్తుని విశ్వసించడం నా తల్లిదండ్రులకు గాని, నాకు గాని తెలియదు. నేను 7వ తరగతి చదువుతున్న రోజులలో మా ఇంటి ప్రక్క ఇంట్లో ప్రార్థన జరిగేది. ఆ ప్రార్థనలకు నేను ఒక్కడినే వెళ్తూ ఉండేవాడిని. నా 10th క్లాస్ సమయములో మా అమ్మకి కలిగిన అనారోగ్యమును బట్టి ఆమె కూడా ప్రార్థనకు వస్తూ ఉండేది. ఆ తరువాత కొన్ని దినములకే బాప్తిస్మం అంటే ఏమిటో తెలియకుండా బాప్తిస్మం తీసుకున్నాను. అప్పటికి నా క్రియలు భయంకరంగా ఉండేవి. లోకములో ఉన్న అన్ని వ్యసనములతో జీవించేవాడిని. ఐ.టి.ఐ చదివే సమయములో విపరీత ప్రవర్తనతో ఉండేవాడిని. ఎక్కడైనా మీటింగ్స్ జరిగేటప్పుడు వెళ్ళేవాడిని, అప్పుడు మాత్రం తండ్రీ ! నా వ్యసనముల నుండి నన్ను విడిపించు అని ప్రార్థించుకునేవాడిని కానీ బయటికి వచ్చిన తరువాత యధావిధిగానే జీవించేవాడిని. నా గురించి నా తల్లిదండ్రులకు తెలిసింది కొంచెమే దానికే ఎంతో బాధపడి, నాకు తెలియకుండా ఏడ్చుకునే వారు. నేను నా తల్లిదండ్రులకు ఒక్కడినే అవ్వడం వలన నాకు ఎలాంటి ఇబ్బంది కలుగకూడదని ఎన్నడూ మందలించలేదు. దాని వలన ఇష్టానుసారంగా జీవించేవాడిని. నేను ఇంకా ఇంటి దగ్గరే ఉంటే పాడైపోతానని అప్రెంటీస్ కోసం హైదరాబాద్‌కు పంపించారు. ఇక్కడికి వచ్చిన తరువాత కూడా ఎవ్వరి భయము లేకపోవడంతో త్రాగడం ఎక్కువైపోయింది. చర్చికి కూడా వెళ్ళేవాడిని కాదు.

నేను ఊర్లో ఉన్నప్పుడు మా అమ్మ వెంట వీరంకిలాకు చర్చికి అప్పుడప్పుడు వెళ్ళేవాడిని. అక్కడ ఉన్న మోజెస్ పాష్టరుగారు నా అడ్రస్ హైదరాబాద్‌లో ఉన్న ఎపఫ్రా అన్నకు ఇవ్వడం వలన, అన్న నా దగ్గరకు వచ్చి పరిచయం చేసుకొని, ప్రతి ఆదివారం ప్రార్థనకు తీసుకొని వెళ్ళేవారు. అప్పుడు చింతల్‌లో నలుగురైదుగురితో ఒక ఇంట్లో ప్రార్థన జరుగుతూ ఉండేది. ఒకవేళ అన్నకి కుదరకపోతే ఎవరో ఒకరు నా కోసం వచ్చేవారు. అప్పుడే నా జీవితములో ఒక మార్పు ప్రారంభమైంది. 2001వ సంవత్సరం జనవరి 26న సుమారు 10 మందితో చింతల్‌లో ఇంట్లో ఉపవాస ప్రార్థన జరిగింది. నేను ఎన్నో మీటింగ్స్‌కి, ప్రార్థనలకి వెళ్ళాను కానీ, ఆ సమయము వరకే, తరువాత నాలో ఎలాంటి మార్పు కలిగేది కాదు. ఆ ఉపవాస ప్రార్థనలో వినిన వాక్యము, చేసిన ప్రార్థనలు నా

జీవితమును మార్పులోనికి నడిపించాయి. ఒక్కసారే మారాను అని కాదు కానీ, ముఖ్యంగా అన్న నా పట్ల చూపించిన ప్రేమ, క్షమాపణ, కనికరం నన్ను ఎంతగానో ప్రభావితం చేసాయి. మా అమ్మ, నాన్న కూడా నేను మార్పు చెందిన విషయం తెలిసి, ఎంతగానో సంతోషించారు. కొన్ని నెలలకు మా అమ్మ మరణించింది.

బలహీనతల వలన మరణకరమైన పరిస్థితులలోనికి వెళ్ళినప్పుడు దేవుడు నన్ను ఆదరించి, బలపరిచారు. భయంకరమైన యాక్సిడెంట్ నుండి ఆయన దూతను పంపి, కాపాడి సజీవుడిగా నన్ను నిలిపారు. నా వివాహ విషయంలో కూడా రక్షించబడిన మంచి భార్యను, తద్వారా ఇద్దరు పిల్లలను దేవుడు నాకు అనుగ్రహించారు.

నేను పుట్టినది మొదలుకొని ఎన్నోసార్లు దూషించి, అవమానించి ఆయనకు వ్యతిరేకంగా ప్రవర్తించిననూ నాకు ఏదీ తక్కువ కాకుండా, ఆర్థికంగా ఆరోగ్యంగా సమస్తమును దేవుడు అనుగ్రహిస్తూ ఉన్నారు. నాకు కలిగిన పరిస్థితులను బట్టి ఎన్నడూ కృంగిపోకుండా దేవుని నుండి దూరం కాకుండా ఎల్లప్పుడూ సంతోషంగా ఆయనలో నిలిపి ఉంచారు.

ఇప్పుడైతే నా మట్టుకు నాకు చావైనా, బ్రతుకైనా ఎంత హీనమైన పరిస్థితులు కలిగినా దేవుని నుండి చివరి శ్వాస వరకు ఎన్నడూ దూరం కాకుండా సంఘముతో అంటుకట్టబడి అన్న చెప్పింది చెప్పినట్లుగా చేయాలని నన్ను బట్టి పరిచర్యకు దేవుని నామమునకు అవమానం కలగకూడదని ఉంది. నేను, నా కుటుంబము చివరి శ్వాస వరకు పరిచర్యలో మనస్సు కలిపి మంచి అవయవములుగా ఉండాలని కాంక్షిస్తున్నాను. మా కొరకు ప్రార్థించగలరు.


## ముఖ్య గమనిక:

**ఎపఫ్రా మినిస్ట్రీస్** ఆఫీసు ప్రారంభించడం జరిగినది.
ఉదయం 10.30 గం॥ల - సాయంత్రం 6.30 గం॥ల వరకు
మీ ప్రార్థనావసరతలకై సంప్రదించగలరు.

ప్లాట్ నెం.1, శాంతినగర్, భార్గలత కాలని,
వనస్థలిపురం, హైదరాబాద్ - 500 070
Ph: 040-24202227 Cell: 9666666249
email: mail2church@gmail.com



# మదర్ తెరీసా

ఆగస్ట్ 27, 1910 లో మదర్ తెరీసా యుగోస్లావియాలో ఉన్న "స్కోపియె" అనే గ్రామములో అల్బేనియా దంపతులకు జన్మించింది. ఆమె అసలు పేరు "ఆగ్నెస్ గోన్‌షా బొయాజు" అంతా ఆగ్నెస్ అని పిలిచేవాళ్ళు. తండ్రి పేరు నికోలస్, తల్లి పేరు ద్రాణా. ఆ ఊర్లో వ్యాపారం చేస్తూ దాని మీద వచ్చే అల్పాదాయముతో జీవనం గడిపేవారు. ఆగ్నెస్‌తో బాటు మరో ఇద్దరు – ఓ అబ్బాయి లాజర్, అమ్మాయి ఆగా కూడా పుట్టారు.

చిన్ననాటి నుండే ఆగ్నెస్ దయార్ద్ర హృదయురాలు. ఎవరు ఏ విధంగా కష్టపడుతున్నా తాను ఓర్చుకోలేకపోయేది. వెంటనే తనకు చేతనైన సహాయం చేసేది. పెద్దల పట్ల గౌరవమును, పేదవాళ్ళ పట్ల ప్రేమను చూపించే లక్షణాలు ఆగ్నెస్ తన తల్లిదండ్రుల దగ్గర నుంచి పుణికి పుచ్చుకుంది. తను చదువుకునే రోజుల్లోనే 'ఆగ్నెస్ – సొడాలిటీ' అనే కతోలిక మతశాఖలో సభ్యురాలిగా చేరింది. తాను ఒక మిషనెరిగా ఏ దేశమునకన్నా వెళ్ళి దైవరాజ్య వ్యాప్తికి కృషి చేయ్యాలని సంకల్పించింది.

ప్రకృతి అందములో ఏ దేశమునకు తీసిపోని భారతదేశమును సందర్శించాలని ఆకాశపు వాకిండ్ల దాకా ఎదిగిన హిమాలయ పర్వతములలో తాను ఒక తపస్వినిగా రూపొందాలని, ఏ ఆదరణకూ నోచుకోలేని అభాగ్యజీవుల దగ్గరకు వెళ్ళి వాళ్ళను పరామర్శించి, క్రీస్తు ప్రేమలోని మాధుర్యమును వాళ్ళకు చవిచూపాలని ఆగ్నెస్ 18 సం॥ల వయస్సులోనే ఉవ్విళ్ళూరుతూ ఉండేది.

అమ్మా, నాన్న పంచన చేరి, కొండంత ఆనందమును పండించే ఇంట్లో తోబుట్టువులతో పాటు తానూ వివాహం చేసుకొని సంసారిక జీవితమును అనుభవించకుండా, ఎక్కడో ... వేల మైళ్ళ కొద్దీ దూరంలో ఉన్న మరో ప్రపంచంలో అనామికగా అడుగుపెట్టి నిర్భాగ్యుల మధ్య సేవ చెయ్యాలని ఆగ్నెస్ నిశ్చయించుకోవడం నమ్మలేని నిజం.

అయితే – క్రీస్తు ప్రతినిధిగా, ప్రేమాభరితమైన ఆయన దివ్యరాజ్యమును వివరించే రాయబారిగా విశ్వప్రేమను చూపించే సేవికగా తన జీవితం పండిపోవాలన్న అచంచలమైన సంకల్పం ఆగ్నెస్‌ను విదేశానికి సిద్ధం చేసింది.

ఆగ్నెస్ 1929 జనవరిలో భారతదేశమునకు వచ్చింది. మతకన్య శిక్షణ కోసమని ఆమెను డార్జిలింగ్ పంపించారు. రెండేళ్ళ తరువాత మే నెల 24న ఆగ్నెస్ తన మొదటి మత వాగ్దానములను చేసింది. "నేను చేసే ప్రతి పనిలోను ప్రేమ కనిపించాలి" అని సెయింట్స్ థెరీసా పలికిన పలుకులు ఆగ్నెస్ జీవితమునకు నూతన దిశను ఏర్పరిచాయి. అందుకే ఆగ్నస్ పేరును "తెరీసా" గా మార్చుకుంది. ఆ తర్వాత తెరీసా కలకత్తాకు వచ్చింది. అక్కడ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా, ఆ తర్వాత ప్రధానోపాధ్యాయురాలిగా బాధ్యత వహించింది. 20 సం॥లుగా కలకత్తాలో జీవించిన ఆమెకి సామాన్యుడి జీవితం దుర్భరం, నిరుపేదల జీవితం నిట్టూర్పులే అని అర్థమై నిరాశ నిస్పృహల మధ్య నలిగిపోయే నిరుపేదల మధ్యకు వెళ్ళి సేవ చేయాలి అని ఆ శుభ ఘడియల కోసం ఎదురుచూస్తూ ఉంది.

సెప్టెంబర్ 10, 1946 కలకత్తా నుండి డార్జిలింగుకు రైల్లో ప్రయాణిస్తూ, ప్రార్థిస్తున్న సమయములో లొరెటో మతమును వదిలి మురికి వాడల్లో అనాధుల మధ్య అభాగ్యుల మధ్య సేవ చెయ్యి – అన్న సందేశం తన హృదయాంతరములో దైవ సందేశంగా వినిపించింది. విశిష్ఠమైన సేవకు అది దేవుని పిలుపు. 20 సం॥లు మత జీవితమునకు మంగళం పాడి అందరి దగ్గరా శెలవు పుచ్చుకొని రాత్రి పూట ఏ ఆర్భాటం లేకుండా రైల్వేస్టేషన్‌కు వెళ్ళింది. ఒక చేతి సంచి – అందులో బైబిలు, ప్రార్థన పుస్తకం, రెండు చీరలు, అయిదు రూపాయలు. తనకి ఉన్న సర్వస్వం అదే వాటితోనే బయలుదేరింది నూతన గమ్యమునకు.

లొరెటో కాన్వెంట్ ప్రక్కలోని మోతీజీల్ అనే పేటలో పెద్ద మురికి వాడ ఒకటి ఉంది. అందులో డిశెంబర్ 21, 1948లో ఒక చిన్న బడిని తెరిచింది. తరువాత కాళీఘాట్‌లో ఒక వసతిని తీసుకుని దానికి "నిర్మల్ హృదయ్" అని పేరు పెట్టింది. కాళీమాత గుడి అతి పురాతనమైన దేవాలయం కాళీఘాట్‌లో ఉంది. ఆ కాలికా గుడిని ఆనుకొని ఉన్నదే "నిర్మల హృదయ్". కాళీమాత పూజారుల ఆగ్రహానికి అంతులేదు, ఎంత త్వరగా తెరీసాను మెడపట్టి గెంటించి వేద్దామా అని ఆలోచిస్తుంటే – పదిమంది కుర్రకారును వెంటేసుకుని ఓ రాజకీయ నాయకుడు అక్కడ వచ్చి వాలాడు. సంగతంతా విన్నాను. నేను వెళ్ళి తెరీసాను ఈడ్చుకొస్తాను. మీరు ఇక్కడే ఉండండి. అని నిర్మల హృదయంలో ప్రవేశించాడు. అక్కడ మదర్ తెరీసా ఒక రోగి పుండ్లను కడుగుతూ కనిపించింది. ప్రాణాలు పోతున్న మరొకని దగ్గరకు పరుగెత్తి అతన్ని తన చేతుల్లోకి తీసుకొని అతన్ని ఓదార్చుతుంది. అప్పుడే చనిపోయిన వాళ్ళ శవాలను కొంతమంది సిస్టర్స్ కడుగుతున్నారు. అలాంటి మరణావస్థలో ఉన్నవాళ్ళు 40కి పైగా కనిపించారు. తన కళ్ళను తానే నమ్మలేక పోయాడు. ఇలాంటి సేవలు చేసేవాళ్ళు కూడా ఉన్నారా అని దిగ్భ్రాంతి చెందాడు. అదంతా చూశాక

రాజకీయ నాయకుని మనసు కరిగిపోయింది. ముంచుకొస్తున్న దఃఖమును దిగమింగుతూ వెలుపలకు వెళ్ళాడు. తన కోసం కాచుకొని ఉన్న కుర్రకారు, పూజరులు చుట్టూ మూగి – ఏది తెరీసా అని అడిగారు. అందుకు జవాబుగా – నేను ఆమెను ఈడ్చుకొస్తాను కాని మీ తల్లులూ, అక్కచెల్లెళ్ళూ వచ్చి ఆమె చేస్తున్న సేవ చేస్తారా? అని అడిగాడట. వాళ్ళు కూడా లోపలకు వెళ్ళి చూశారు. మారుమాట్లాడకుండా బయటకు నడిచారు. తరువాత కాళీకా గుడి పూజారులు కూడా మదర్ తెరీసాకు మిత్రులయ్యారు.

## అనుభూతి

ప్రతి వ్యక్తిలో నేను దేవున్ని చూస్తాను. ప్రతి వారిలో నాకు దేవుడు కనిపిస్తాడు. కుష్టురోగి గాయాలను కడిగే సమయములో అది ప్రభువుకు చేసే సేవలా భావిస్తాను. ఇది ఒక అద్భుతమైన అనుభూతి.

## సానుభూతి

పేదవాళ్ళకు మనం ఇచ్చే దాని కన్నా మనకు వాళ్ళిచ్చేదే ఎక్కువ. రోజుల తరబడి పానీయాలు లేకపోయినా జీవించగల సమర్థులు. ఎవరినీ శపించరు. ఎవరి మీదా గొణగరు. మన జాలి, సానుభూతి వారికి అక్కర్లేదు. వాళ్ళ నుంచి మనం నేర్చుకోతగినది ఎంతైనా ఉంది.

## ఉపకారం

పరులకు ఎలా ఉపకరిస్తానా, ఎలా సహాయపడతానా అనే విషయమును పదే పదే ఆలోచిస్తూ ఉండాలి.

## క్రైస్తవ్యానికి

ప్రేమ, అమిత ప్రేమ అనేవి క్రైస్తవ్యానికి మూలసూత్రాలు

## కవచం

అయోమయ పరిస్థితిలో చిక్కుకున్నప్పుడు దేవుని మీద మనకి ఉన్న నమ్మకం కవచంలా ఉపకరిస్తుంది. దాన్నెవరూ కదిలించలేరు.

## పెద్దమనసు

పనులు చిన్నవే అయినా పెద్దమనసుతో, ప్రేమతో చెయ్యాలి

## సంతోషంగా

సంతోషంగా ఇచ్చేవాడే అధికంగా ఇచ్చేవాడు

## పంచుకోవడం

ప్రేమించడమంటే మనకున్నదేదో పదిమందితో పంచుకోవడం, ఇందులో స్వార్థానికి తావు లేదు

## ప్రేమకు ప్రతీకలు

మనం చేసే పనుల ద్వారానే మన ప్రేమ వెల్లడవుతుంది. విలువైన పనులు ప్రేమకు ప్రతీకలు

## పరిమితి లేని ప్రేమ

ప్రేమకు పరిమితి ఉండకూడదు. అప్పుడే మరింత గాఢంగా, అందంగా, పరిపూర్ణంగా ప్రేమించడానికి వీలవుతుంది

## నమ్మకం

నా పనిలో కేవలం విజయమునే సాధించమని దేవుడు నన్ను పిలవలేదు కాని ... నమ్మకంగా పని చెయ్యమని ఆదేశించాడు.

## శక్తివంచన లేని పని

నువ్వే పని చేసినా శక్తి వంచన లేకుండా చెయ్యి. డబ్బు కోసమో, పేరు ప్రతిష్ఠల కోసమో కాకుండా దేవున్ని ప్రేమించి పని చెయ్యి. అలా చెయ్యడం వల్ల యావత్ ప్రపంచానికే సేవ చేసిన వాళ్ళవుతారు.

## శాంతి నిలయం

వక్రగతిలో పరిభ్రమించే ప్రపంచం తలక్రిందులయిందేమో అనిపిస్తుంది. అమితంగా పెరిగిపోయే అశాంతికి, బాధకు కారణం – గృహస్థ జీవితంలో ప్రేమ లేకపోవడమే. ఇంట్లోనే శాంతి కరువైపోవడం, కుటుంబ సభ్యులమధ్య, పిల్లల మధ్య ప్రేమలేకపోయినా, వాళ్ళతో సంతోషంగా సమయాన్ని గడపలేక పోయినా...ఇతరుల దగ్గరకు శాంతగుణంతో వెళ్ళే సమయం ఉండదు. పరులకు పరిచర్యమినహా ప్రేమకు వేరే భాష్యంలేదు.

# ప్రార్థన - ఊపిరి పీల్చుట వంటిదే

ప్రతి ఒక్కరి జీవితములో ప్రార్థన వేరు వేరు కోణాల్లో ఉంటుంది. కాబట్టి ప్రార్థన అనేది కష్టపడి, ప్రయాసపడి, నెరవేర్చునది కాదు. అది కేవలం దేవునితో మాట్లాడుటయే. ఒక వ్యక్తి కొన్ని సంవత్సరములు అభ్యసించి, అలవరచుకున్న ప్రార్థనా జీవితమును, దేవునితో అతని నడకను చూచి అతని వలె నిపుణత కలిగి ప్రార్థించాలని ప్రయత్నించనవసరం లేదు. ప్రార్థనలో ఇతరుల కంటే చిన్నబిడ్డ వలె ఉండుటలో తప్పులేదు, మన అనుభముతో నిమిత్తం లేకుండా దేవుడు మన ప్రార్థనలు విని జవాబుని ఇస్తాడు. ఇతరులతో పోల్చుకొనుట కేవలం బాధను కలిగిస్తుంది. కానీ మనం నేర్చుకుంటూ, ఎదుగుతున్నందుకు దేవుడు సంతోషిస్తాడు.

కొందరు ఇతరుల కంటే ప్రభావవంతమైన ప్రార్థనలు ప్రార్థించగలరు. కొందరు ఇతరుల కంటే ఎక్కువ విశ్వాసం కలిగి ఉంటారు. కొందరు ఇతరుల కంటే బాగా దేవుని మార్గములు అర్థం చేసుకుంటారు. కొందరు ఇతరుల కంటే దేవునికి త్వరగా లోబడతారు. కొందరు వాక్యములో ఇతరుల కంటే ఎక్కువ సమయం గడుపుతారు. కొన్ని సమయములలో కొందరు నూతన స్థాయికి వెళ్ళుటకు సిద్ధంగా ఉంటారు, కాని అవసరమైన కొన్ని పనులు చేయలేక పోవుట వలన వెళ్ళలేరు. ఉదాహరణకు దేవునితో తమ సంబంధం వృద్ధి చెందుటకు ముందుగా వారు కొందరిని క్షమించవలసి ఉంటుంది. లేక ఒక వ్యక్తి వ్యక్తిగతంగా లేక పరిచర్యలో సాహసవంతమైన అవకాశమును పొందుటకు ముందుగా దేవుని ప్రేమ యొక్క లోతైన ప్రత్యక్షతను పొందవలసి ఉంటుంది. నిర్లక్ష్యంగా మనందరం ఒకచోట ప్రారంభించి, మరొకచోటికి వెళ్తాము. మనం ఎక్కడ ఉన్నా కూడా మొదలుపెట్టి, ఎదుగుటకు ఆయన సహాయపడతాడు.

ప్రార్థన అభివృద్ధికరమైనది, మనము ఒక స్థాయి నుండి మరొక స్థాయికి వెళ్ళవలసినది. ఎవరూ ప్రార్థనలో ఎప్పటికీ "పట్టభద్రులు" కాలేరు. ఎందుకంటే దేవునితో మన సంబంధం యొక్క లోతునకు హద్దులు లేవు అది లోతుగాను, మరింత బలంగాను ఎదుగుతూనే ఉంటుంది. మన ప్రార్థించు సామర్థ్యము ఎక్కువగా మారుతుంది. మనం ప్రార్థనలో ఎప్పటికీ "పట్టభద్రులు" కాలేము. దేవునితో సంభాషించుట అనేది నేర్చుకొనుటను ఆపలేము మన అనుభవం గొప్పగా ఉత్తమంగా మారుతూనే ఉంటుంది.

మనం మన అంతిమ లక్ష్యమును చేరకపోవచ్చును. కాని మనలను అక్కడికి తీసుకొని వెళ్ళు మార్గములో మనం ఉన్నందుకు దేవునికి వందనములు చెల్లించవచ్చును. మనం అభివృద్ధి చెందుతున్నంత కాలం మనం ప్రాకుతున్నా, నడుస్తున్నా,

పరిగెడుతున్నప్పటికీ నేర్చుకుంటూనే ఉండాలి. మనం పరిశుద్ధాత్మునికి సులువుగా స్పందిస్తూ, దేవునికి ప్రార్థిస్తూ ఆయన నిర్దేశకత్వములో మార్పులు చేసుకున్నట్లైతే ఆయన మనలను ఆత్మీయ జీవితపు పరిణితిలోని నూతన ప్రదేశములకు తోడుకొని పోయి, ప్రార్థనా సన్నిహితత్వంలోని నూతన స్థాయిలకు నడిపిస్తూనే ఉంటాడు. 'మనం ప్రార్థించాలని ఆ ప్రార్థనలో ఆనందించాలని దేవుడు కోరుకుంటున్నాడు".

## ప్రార్థనా శక్తి

విశ్వమంతటిలో మనకు అందుబాటులో ఉన్న గొప్ప శక్తులలో ఒకటి ప్రార్థన మాత్రమే. భౌతిక లోకములో మనకు తెలిసిన శక్తులు సహజమైనవి. అయితే ప్రార్థనా శక్తి ఆత్మీయమైనది. ప్రార్థన అనేది దేవుడు పని చేయుటకు ద్వారమును తెరుస్తుంది. మన జీవితములలో జ్ఞానము, ప్రోత్సాహం, నిర్దేశకత్వము, ఒక అద్భుతమైన మలుపు కలుగునట్లుగా మనకు పరలోకపు శక్తి అవసరమైనప్పుడు భూమిపై నుండి మనము చేయగలిగిన క్రియ ప్రార్థనే. మన జీవితములలో సర్వశక్తిమంతుడైన దేవుని శక్తిని విడుదల చేసేది – ప్రార్థన. ప్రార్థనా శక్తి దేవుని శక్తితో మనలను కలుపుతుంది – అందుకే ఇది మనము ఊహించిన వాటన్నిటి కంటే గొప్ప శక్తియై యున్నది. ప్రార్థనా శక్తి మాత్రమే దేవుని చేతిని కదిలించగలదు. దేవుని శక్తి మాత్రమే ఒక వ్యక్తి హృదయమును మార్చగలదు. బంధకముల నుండి, హింసల నుండి ఒక వ్యక్తిని విడుదల చేయగలదు. నిరాశ, నిస్పృహలను మార్చి, వ్యసనముల నుండి విడిపించి ఉద్రేకములను స్వస్థపరచగలదు. దేవుని శక్తి మాత్రమే శాంతిని, సంతోషమును కలిగించి, ప్రతి విధమైన అద్భుతమును చేయగలదు.

మనము అసాధారణ శక్తి కలిగిన సాధారణ మనుష్యులము, అసామాన్య జీవితములు జీవించు సామాన్య మనుష్యులము. ప్రార్థన ద్వారా మాత్రమే సాధ్యమైన, దేవుని శక్తితో సంబంధమును కలిగియున్నంత కాలం – మనం ఎప్పటికీ జయించలేమని తలంచిన సమస్యలని జయించగలం. మనము చేస్తామని ఎవ్వరూ నమ్మని పనిని మనము చేయగలం, మనము జ్ఞానవంతమైన నిర్ణయములు తీసుకోగలం, మన జీవితములలోని పెద్ద పెద్ద సవాళ్ళలో విజయవంతంగా నడవగలం.

– సేకరించబడింది



# నదులు

## యోర్దాను నది

యోర్దాను నది పాలస్తీనా దేశములో ప్రాముఖ్యమైనది, పరిశుద్ధ గ్రంథములో ప్రస్తావించబడిన నదులన్నిటిలో కెల్ల ప్రసిద్ధి చెందినది. పాలస్తీనా దేశమును తూర్పు, పడమరలుగా ఈ నది విభాగించును. లెబానోను పర్వతముల యందు పుట్టిన 4 సెలయేరుల సంగమం యోర్దాను నది. లెబానోను పర్వతముల నుండి మృత సముద్రము వరకు ప్రవహించును. వాటి మధ్య ఉన్న దూరము 135 మైళ్ళు మాత్రమేయైనను ఈ నది 250 మైళ్ళు ప్రవహించును.

1. ఈ నదీ ప్రాంతముల పచ్చని, ఫలవంతమైన దశ లోతును ఆ ప్రదేశములకు ఆకర్షించెను.
2. యాకోబు ఈ నదిని యబ్బోకు సమీపమున దాటెను.
3. ఇశ్రాయేలీయులు తమకు వాగ్దానము చేయబడిన కనాను దేశములోనికి వెళ్ళునట్లు యెహోషువ ఈ నదిని రెండు పాయలుగా చేసెను.
4. ఈ నదిని ఏలియా రెండు పాయలుగా చేసి అతడును, ఎలీషాయు పొడినేల మీద దాటిపోయిరి.
5. దేవుని శక్తిని పరీక్షించుటకు ఎలీషా ఈ నదిని రెండు పాయలుగా విడగొట్టెను.
6. ఈ నదిలో నయమాను స్నానము చేసి, తనకు గల కుష్ఠరోగము నుండి స్వస్థత పొందెను.
7. బాప్తిస్మమిచ్చు యోహాను ప్రభువైన యేసుకు బాప్తిస్మమిచ్చినది ఈ నదిలోనే.




# బైబిల్ క్విజ్ -24

ఈ క్రింది ప్రశ్నలకు సరైన జవాబులు వ్రాయండి.

యాకోబు పత్రికలో నుండి ఇవ్వబడినవి

**1.** ఎవరి విజ్ఞాపన మనఃపూర్వకంగా, బహుబలంగా ఉంటుంది ?

**2.** దేవుని స్నేహితుడు అని పేరు ఎవరికుంది ?

**3.** మేలైనది చేయ నెరిగియు ఆలాగు చేయనివానికి ఏమి కలుగును ?

**4.** పక్షపాతమైనను వేషధారణయైనను లేనిది ఏమిటి ?

**5.** ఈ లోకముతో స్నేహము చేయువాడు దేవునికి ఏమవుతాడు ?

**6.** శోధనలను సహించి నిలిచినవానికి ఏ కిరీటం ఇవ్వబడుతుంది ?

**7.** శ్రమానుభవమునకు మాదిరిగా ఎవరిని పెట్టుకోవాలి ?

**8.** మనలో యుద్ధములు పోరాటములు దేనినుండి కలుగుచున్నవి ?

**9.** ప్రకృతి చక్రమునకు చిచ్చుపెట్టునది ఏది ?

**10.** నవ్వును దుఃఖానికి, ఆనందమును చింతకును మార్చుకోవల్సింది ఎవరు ?

ఈ ప్రశ్నలకు సరైన సమాధానములు అక్టోబర్ 15వ తేదీ లోపు మాకు వ్రాసి పంపించండి. సరైన సమాధానములు వ్రాసిన వారి పేర్లు నవంబర్ 2012 పత్రికలో ప్రచురించబడతాయి.

**పంపవలసిన చిరునామా :-** ఎడిటర్ - స్పర్శ, ఎపఫ్రా మినిస్ట్రీస్, ప్లాట్ నెం.6, భాగ్యలత కాలని, వనస్థలిపురం, హైదరాబాద్ - 500 070.

**బైబిల్ క్విజ్ - 23 జవాబులు హెబ్రీ పత్రిక :**

**1.** హేబేలు 11 :4

**2.** అబ్రాహాము 7:4

**3.** మెల్కీసెదెకు **5**:6

**4.** మెల్కీసెదెకు 7:3

**5.** యేసురక్తము **12**:24

**6.** 3 మాసములు 11:23

**7.** యేసుక్రీస్తు 9:11

**8.** యూదా గోత్రం 7:14

**9.** నోవహు **11**:7

**10.** నీతి, సమాధానం 7:3

**బైబిల్ క్విజ్ - 23 ప్రశ్నలకు సరియైన జవాబులు వ్రాసి పంపిన వారి పేర్లు :**

పూజిత, ఛత్రిక, కృప, విజయకుమారి, సౌజన్య, శ్యామ్‌ప్రసాద్, హేమలత, సుధారాణి

# జన్మదిన శుభాకాంక్షలు

క్రీస్తునందు ప్రియులైన వారికి శుభమని చెప్పి వ్రాయునది.
తండ్రియైన దేవుని నుండి కృపయు, సమాధానము మీకు కలుగును గాక !
ఈ పత్రిక ద్వారా జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తున్నాము.

**" నీ దేవుడైన యెహోవా కన్నులు సంవత్సరాది మొదలుకొని సంవత్సరాంతము వరకు ఎల్లప్పుడు మీ జీవితముల మీద ఉండును గాక ! "**

## సెప్టెంబర్ - అక్టోబర్

**భాగ్యలత** : సందీప్, ఇందిరా ప్రియ, ఐజాక్, ప్రసాద్, జ్యోతి, ప్రియాంక, సుధ, శ్రీలక్ష్మి, షాలేం, కిరణ్‌కుమార్, మాధురి, ప్రేమ్‌కుమార్, దీవెన, చెన్నకేశవరెడ్డి, ప్రదీప్‌కుమార్, స్వరూప్, హోసన్న, అరుణ, రాణి, శేఖర్, ప్రజ్ఞ, అనిత, అన్నపూర్ణ, ప్రీతి, నిర్మల, ఉషారాణి, ఫిలిప్పు, సాల్మన్‌రాజు, మాధవి, శామ్సన్, ఏసుబాబు, దీపిక, షారోను, ప్రియదర్శిని, సూర్యరాజు, మల్లేశ్వరి, సైమండ్, సుధారాణి, ప్రణీత్‌కుమార్, ప్రసన్నకుమార్, దివ్యదీపిక, సంజయ్‌రాజు, రవికుమార్ (మిర్యాలగూడ)

**చింతల్** : జయరాజ్, జయమ్మ, సుధాకర్, సోనురాజ్, ప్రసాద్, శ్యామ్, శేఖర్, కళ్యాణ్, కృష్ణవేణి, ఎఫ్రాయిము, రాజేష్, పద్మజారాణి, పవన్‌కుమార్, సునీల్‌కుమార్, త్రిమూర్తులు, భవాని, రాజు, నరేంద్ర, ప్రమీల, రాజేష్, దుర్గాప్రసాద్, వేణుకుమారి, శ్రీహర్షవర్మ, మీనా, సంధ్య, ఇందిరాజ్యోతి, శేఖర్, సాగర్, విశేష, శ్రేయస్

**అనాజ్‌పూర్ :** వరప్రసాద్, కళ్యాణ్ కుమార్, రామారావు, సుష్మ, మమత, చంద్రకళ

**ఇ.సి.ఐ. యల్ :** సుజని

**'స్పర్శ'** అనే మన ద్విమాస పత్రిక ప్రతి విడి పత్రిక రూ.10/–లు, సంవత్సర చందా రూ. 50/–లు, జీవితకాల చందా రూ. 1000/–లు మరియు విదేశములకు సంవత్సరమునకు **US $ 20.**

చందాదారులు కావలసిన వారు **ఎపఫ్రా మినిస్ట్రీస్ ట్రస్ట్, హైదరాబాద్** (Epaphras Ministries Trust, Hyderabad) పేరున **డి.డి/మనిఆర్డర్** తో పాటు మీ పూర్తి వివరములు ఈ ఫారములో నింపి మా చిరునామాకు పంపించగలరు.

1. పూర్తి పేరు: ______________________________

2. చిరునామా: ______________________________

______________________________

______________________________

పిన్ కోడ్: ______________________________

<u>మీ ప్రార్థనావసరతలు:</u>

______________________________

______________________________

______________________________

______________________________

మా చిరునామా:

**ఎపఫ్రా మినిస్ట్రీస్,** ప్లాట్ నెం.1, శాంతి నగర్, వాటర్‌ట్యాంక్ ఎదురుగా, భాగ్యలత కాలని, వనస్థలిపురం, హైదరాబాద్–70, ఫోన్: 040–2420 2227

2012, ఆగష్టు 15 వతేదీ బాలాజీ ఫంక్షన్ హాల్, హయత్‌నగర్ - హైదరాబాద్ నందు జరిగిన
ఉపవాస ప్రార్థనలో దేవుని బిడ్డలు ఆశక్తితో పాల్గొని దేశం కొరకు ప్రార్థించి, దేవుని స్తుతించడం జరిగినది.



2012, ఆగష్టు 15 వతేదీ జరిగిన ఉపవాస ప్రార్థనలో

స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా జెండా వందన కార్యక్రమము జరిగినది.





# ఎపఫ్రా మినిస్ట్రీస్

ప్లాట్ నెం.1, శాంతినగర్, భాగ్యలత కాలని,
వనస్థలిపురం, హైదరాబాద్ - 500 070

Ph: 040-24202227 Cell: 9666666249
email: mail2church@gmail.com | web: www.epaphra.org